# మరపురాని సంఘటన

## కుమారి జమున



ఎం. ఎం. పిక్చర్స్ చిత్రంలో జమున

ఆ రోజు నిజంగా మరుపురాని రోజు. ఆర్టిస్టుల హృదయాలు ఎంత సున్నితమైనవో!! బయట ప్రపంచంలో జరిగే అనేక చిత్ర విచిత్ర సంఘటనలలో హృదయవిదారకమైన ఏ సంఘటననైనా చూచి, మనస్సులో కలిగిన అలజడిని తట్టుకోలేనంత మార్దవం అక్కడ నిండివుంటుందన్న సత్యాన్ని నేనారోజు తెలుసుకొని ఆశ్చర్య పోయాను. సామాన్య ప్రజానీకంలో ఎన్ని హృదయవిదారకమైన సంఘటనలు జరిగినా వారు అలాంటి దృశ్యాలు ఎన్నో చూచి ఉన్నందువల్ల కాబోలు అంతగా బాధ పడ్డట్టు కనిపించరు. సామాన్యంగా సినిమాతారలకు అలాంటి దృశ్యాలు కళ్ళపడవు. కారణం షూటింగ్ ఉన్నప్పుడు కార్లలో స్టూడియోకు వెళ్ళడం, షూటింగ్ ముగియగానే ఇంటికి వచ్చేయడం, షూటింగ్స్ లేనప్పుడు రెస్టు తీసుకోవడం అంతకుమించి బయట ప్రపంచంలో ఏం జరుగుతూ వుందో అన్న విషయాలు అంతగా తెలియవు. తెలుసుకోవాలనే తాపత్రయం పడదు. ఉన్న టైమ్ షూటింగ్స్‌కే సరిపోతుంది. మామూలు ప్రజలలా అలాంటి దృశ్యాలకు సామీప్యంగా వుండే అవకాశాలు తక్కువ. అందువల్లనేమో విషాద సంఘటనలు చూచి సహించలేని వ్యక్తిత్వం గల వ్యక్తులుగ తయారయ్యాము. తోటి మానవులకు ఏదేనా కష్ట నిష్ఠురాలు కలిగితే శక్తికొలది చేతనైన ఆర్థిక సహాయాన్ని అందించి ఆత్మసంతృప్తిని పొందుతాము (ఇంతకు అసలు సంగతి ఒదిలివేసి ఏదేదో వ్రాసేస్తున్నాను కదూ!)

ఆరోజు నాకు వాహిని స్టూడియోలో సారగన్ పిక్చర్స్ "సిరికొక్కరుసెన్" అనే అరవ చిత్రం తాలూకు షూటింగ్ ఉన్నది. పగలు 9 గం. నుంచి రాత్రి 9 గం. వరకు. ఆరోజు నా సోలోసాంగ్ పిక్చరైజేషన్, అందువల్ల ఫ్రెష్‌మేకప్‌తో, హుషారైన మూడ్సులో 9 గంటలకంతా స్టూడియోలో అడుగు పెట్టాను. ఆ రోజు నేనంత హుషారుగా వుండడాన్కి కారణం ఆ పాట నాకెంతో యిష్టమైనది. పక్కవాద్యాలు లేకుండా 'సుశీల' ఎంతో చక్కగా పాడిన పాటలని ఆరాత్రి ఆపాటను టేపు రికార్డర్‌లోవిని ఏవిధంగా నటించాలో ఆలోచించుకున్నాను. నేను యిప్పటికి ముఖ్యమైన సీన్సువస్తే డైలాగ్స్ ఫల్లె వేస్తూ అద్దం ముందు క్వార్సుని రిహార్సల్స్‌చేయడం అలవాటు.

మాకారు 'ఫ్లోర్' దగ్గరకు వచ్చి ఆగింది.

మాకారుకు పది గజాల దూరంలో 'కార్పొరేషన్‌వారి 'డాగ్‌వాన్' ఆగి వున్నది. ఆ 'వాన్' నిండుగ ఎన్నోకుక్కలు వున్నవి. కారు దిగుతూనే ఆవేన్‌వైపు రెండడుగులు వేసాను చూడాలనే కాంక్షతో. నాప్రక్కనే వున్న నాలేడీ పర్సనల్ అసిస్టెంట్ "అక్కడికి ఎందుకమ్మా! మీరు వెళ్ళకండి! లోపలకు పదండి" అంటున్నా విని పించుకోకుండా "ఒక్క నిముషం చూసి వస్తాను" అంటూ గబగబ వేన్ దగ్గరకు పరుగెత్తాను. నావెనుకనే ఆమె కూడా వచ్చింది. ఇద్దరం వాన్ ప్రక్కన దగ్గరగా నిలబడ్డాము. కుక్కలను పట్టుకునే ఇద్దరుయుమభటులూ అక్కడ లేరు. వాన్‌లోపల చుట్టూవున్న 'సీట్ల'పై ఎన్నోరకాలైన వూరకుక్కలు, జాతి కుక్కలు తాళ్ళతో కట్టివేయబడి వున్నవి. నేను ఒక్కొక్కదాన్ని పరికించి చూడసాగాను. "ఏమండీ వీటన్నిటిని చంపేస్తారా"? అని ప్రక్కనున్న ఆమెనడిగాను. "అవునమ్మా ఏదో పెద్దగొయ్యిలో వేసి గ్యాస్ వదులుతారట అంది. "అసలు ఎందుకండీ నోరులేని ఈమూగ జీవాల్ని చంపడం" అన్నా. "ఊర్లో బజార్లలో పిచ్చికుక్కలు వుంటవి. మనుష్యులను కరిస్తే ప్రమాదం అందువల్ల చంపేస్తారు". "మరి అయితే, ఈవాన్‌లో వుండే వన్నీ పిచ్చికుక్కలులా లేవే? పాపం! వీటిని కూడా ఎందుకండీ చంపడం అన్నా. "అబ్బ! మీసందేహాలకి సమాధానం యివ్వడం కష్టం. రండి "ఫ్లోర్"లోకి వెళ్ళుదాము" అన్నదామె.

ఆమెమాటలువినకుండా ఒక్కొక్క కుక్కముఖాన్ని పరిశీలించసాగాను. స్వేచ్ఛగారోడ్లమీద తిరుగుతూ వుంటే అజన్మ విరోధుల్లా ఒకదానితో ఒకటి పోట్లాడుకునే ఆ కుక్కలు మృత్యు ముఖాన్ని చూడబోతున్నామనే నైరాశ్యంతో జాలి చూపు

లతో తోకలుముడుచుకొని నిశ్శబ్దంగా మమ్మల్ని చూడసాగాయి. ఆ క్షణంలో ఒక్కొక్కదాని ముఖంలో ఎన్నో భావాలు చదవగలిగాను నేను. మూగ జీవాలు సహజంగా మనతో ఏమైనా చెప్ప దలచుకుంటే హావభావాలద్వారా ప్రదర్శించి మనం వాటి బాధలేమిటో గ్రహించుకునే విధంగా ప్రవర్తిస్తాయి. అందులో కుక్కలు మరీను. ఈరోజుల్లో ప్రతివారు కుక్కల్ని పెంచడం 'హాబీ' గా ఎంచుతున్నారు. మరి కొందరు కుక్కల్ని కుక్కలులా చూడకుండా వాటినికూడా ఇంట్లో ఒక మనిషి మాదిరిగానే భావించి ప్రాణంతో సమానంగా చూస్తారు. వాటిపై విపరీతమైన ప్రేమాభిమానాలు పెంచుకుని, వాటిని చూడకపోతే ఒక్క క్షణం కూడా వుండలేని స్థితి తెచ్చుకుని అవికనుక చని పోతే మనిషిగనక పోతే అన్నం నీళ్ళు ముట్టకుండా ఎంత బాధపడ్తారో అలానే బాధ పడ్తారు. నేను ఈ రెండోకోవకు చెందినదాన్ని. ఒకసారి మాకుక్కపిల్ల చనిపోతే మాయింట్లో దిగులుతో అందరికీ వరుసగ జ్వరం వచ్చింది.

ముఖ్యంగా నేను 10రోజులు,జ్వరం దిగులుతో బాధ పడ్డాను. నాకు కుక్కలంటే విపరీతమైన ప్రేమ. దానంత విశ్వాసమైన జంతువు వేరేదీ లేదు నాదృష్టిలో. బజార్లో తిరిగే వూరకుక్క లకు కూడా ఏదైనా బాధ కలిగితే నామనస్సెందుకో గిలగిలలాడుతుంది. ''అయ్యో! పాపం అంటూ హృదయం ఆక్రోశిస్తుంది.స్టూడియోలో కూడా మేమంతా టిఫిన్స్ తింటూ వుంటే మొత్తం కుక్కలన్నీ మాచుట్టూ చేరుతవి. వాటికి కూడా మేము తినేదాంట్లో ఏదో ఒకటి వేస్తూ వుంటాము. ఎవరైన కుక్కలంటే అసహ్యం గల వ్యక్తులు వాటిని దూరంగా తరిమి వేయు మంటారు. 'బాయ్' రాయితోకాని, కర్రతోగాని నాయెదురుగ కొడితే, నాకు బాధ కోపం కలుగు తాయి''. ఎందుకనవసరంగా కొడ్తావు? వెది రిస్తే అదేపోతుందిగా అంటూ కోపడ్తాను.

ఏదో ఆలోచిస్తున్న నాదృష్టి ఒక తల్లి పిల్లల మీద నిలచింది. యింకా సరిగా వడకైనా రాని అమూడు పిల్లలూ, తల్లి దగ్గర పాలుతాగు తున్నవి. ''కళ్ళు తెరువని మీరుకూడా నాతోపాటే మృత్యుగహ్వరంలోకి తోరబడుతున్నారంటూ'' తల్లికుక్క జాలిగా వాటి ఒళ్ళు నాకుతూ వుంది. సామాన్యంగా ఈ కుక్కలన్నీ వారంలో ఆవాన్ వచ్చే రెండు రోజులూ జాగ్రత్తగా ఆయుమ భటుల కళ్ళ పడకుండా ఎక్కడెక్కడో దాక్కుం టవి. రోజూ అర్ధరాత్రిదాకా ''కుయ్యో!'' మని అరిచే కుక్కలు, ''డాగువాన్ వచ్చే రెండు రోజులు అంయిపు, అంతుండవు. అయినా ఆయుమ భటులు వాటిని వెదికి వెదికి తమ కాలపాశంతో బంధిస్తారు.

ఆ కుక్కపిల్లలను చూడగానే, నామనస్సు తల్లడిల్లి పోయింది. ''ఈతలుపు తీసి కుక్క లన్నిటిని విడిచిపెట్టేస్తే! మనస్సు పరిపరి విధాల ఆలోచనలతో సతమతమవుతూ వున్నది. ఈలోగా ప్రొడక్షన్ మ్యానేజర్ వచ్చి ''ఉళ్లె వాంగమ్మా'' అన్నాడు. తెప్పరిల్లి లోనికి నడిచాను. డైరెక్టర్, కెమెరామెన్, ప్రొడ్యూసర్ మొ. లైన వారందరిని నవ్వుతూ మాట్లాడించాను. ఒకసారి పాట రిహార్స్ చేసాను. కానిపైకి నవ్వుతున్నానన్న మాటేగాని హృదయంలో 'తుఫాన్' విజృం భించింది. మేకప్ టచప్ చేద్దామని అద్దం చూస్తున్నా అద్దంలో కూడా ఆదృశ్యమే కనిపించ సాగింది. మరచిపోదామన్నా మరువలేని అదృశ్యం, నాహృదయ ఫలకం మీద ముద్రించ బడింది. అద్దంలో కూడా ఆదృశ్యమే కనిపించ సాగింది. అంతే! ఎంత ఆపుకున్నా ఆగ కుండా కన్నీళ్ళు రాసాగాయి. ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో అనుకుంటూ 'బ్లాటింగు పేపర్,తో కళ్ళనీళ్ళు బ్లాట్ చేయసాగాను. అయినా క్షణ క్షణానికి దుఃఖంఎక్కువ కాసాగింది. వెంటనే కుర్చీలో కూర్చుని కళ్ళు మూసుకున్నా. మూసిన కళ్ళలోనుంచి ధారగారాసాగాయి బాష్పాలు. మాకు కొద్ది దూరంలో కూర్చున్న 'హీరో 'బాలాజీ' చూచి ''ఎందుకండి ఏడు స్తున్నారంటూ' గట్టిగ అరిచాడు. క్షణంలో డైరెక్టర్, ప్రొడ్యూసర్, అందరూ నా చుట్టూ మూగారు''. ఏం! జరిగిందంటూ కళ్ళువిప్పి చూచాను. నిజంగా నాకు సిగ్గేసింది. కుక్కలవాన్ చూచి ఏడుపు వచ్చిందనడానికి ''ఏమీ లేదంటూ కళ్ళనీళ్ళు తుడుచుకున్నా. కాని మాఅసిస్టెంట్ లక్ష్మమ్మగారు అంతా చెప్పేశారు. నాకు తెలియ కుండానే నాకు విపరీతమైన ఆవేశంవచ్చింది. ఒకప్రక్క ఏడుస్తూనే ''ముందు'' ఆకుక్కల వాన్ అక్కడనుండి పంపించి వేయండి.ఆర్టిస్టుల మనస్సు సున్నితమైంది. ఈలాంటి విషాద దృశ్యాలు కళ్ళపడితే మా'మూడ్సు'మారిపోతాయి. దయచేసి యికమీద ఎప్పుడూ స్టూడియోలోకి 'ఈవాన్'రాకుండా చూడండి'' అన్నాను. ప్రొడ్యూ సర్‌గారు బయటికి వెళ్ళి అవాన్అక్కడ లేకుండా పంపించి వేశారు. ఆసమయంలో కొంతమంది నవ్వుకున్న వ్యక్తుల్ని,నిజంగా సానుభూతి చూపిన వ్యక్తుల్ని చూచాను. నవ్వినవ్యక్తులను చూచి జాలి పడ్డాను. వారికోసంగాని, అందరి మెప్పుకోసం గాని, నేను దు:ఖించలేదు.ఆమూగజీవాల్ని చూచి, నామనస్సులో కలిగిన బాధను ఆపుకోలేని హృదయ దౌర్బల్యం నాలో వుందేమో! అందుకే ఆసంఘ టన మరుపురాని సంఘటనగా నిలచింది నా జీవి తంలో.

★

అన్నపూర్ణావారి 'వెలుగునీడలు'లో నాగేశ్వరరావు, సావిత్రి

